

రజతోత్సవ పోస్టర్ విడుదల చేస్తున్న ప్రధానార్చకుడు వెంకటాచార్యులు, అర్చకులు

వైష్ణవ సేవా సమాఖ్య రజతోత్సవాన్ని విజయవంతం చేయాలి

యాదగిరిగుట్ట, జూలై 17 : హైదరాబాద్‌లో ఈ నెల 21న నిర్వహించే వైష్ణవ సేవా సమాఖ్య రజతోత్సవాన్ని విజయవంతం చేయాలని యాదగిరిగుట్ట లక్ష్మీనర్సింహ స్వామి ఆలయ ప్రధానార్చకులు నల్లన్‌ధీఘళ్ లక్ష్మీనరసింహాచార్యులు, కాండూరి వెంకటాచార్యులు పిలుపునిచ్చారు. బుధవారం స్వామివారి వైకుంఠ ద్వారం వద్ద రజతోత్సవాల పోస్టర్‌ను విడుదల చేసి మాట్లాడారు. వైష్ణవ సమాఖ్య ఎన్నో కార్యక్రమాలను నిర్వహించి ఎంతో మందికి వటవృక్షంలా విరాజిల్లుతుందన్నారు. 25వ వసంతం పూర్తి చేసుకుంటున్న నేపథ్యంలో త్రిదండి చినజీయర్ స్వామి సమక్షంలో నిర్వహించే రజోత్సవ వేడుకకు తెలుగు రాష్ట్రాలతోపాటు యావత్ దేశంలోని వైష్ణవ కుటుంబాలు పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో వైష్ణవ సేవా సమాఖ్య అధ్యక్షుడు రామాచార్యులు, దేవస్థాన ఉప ప్రధానార్చకుడు కొడకండ్ల మాధవాచార్యులు, అర్చకులు పాల్గొన్నారు.

నేడు రైతు రుణమాఫీ సంబురాలు : ఏఓ

చౌటుప్పల్, జూలై 17 : మండలంలోని కుంట్లగూడెం, జైకేసారం రైతువేదికల క్లస్టర్లలో శుక్రవారం మధ్యాహ్నం నిర్వహించనున్న రైతు రుణమాఫీ సంబురాలను విజయవంతం చేయాలని ఏఓ ముత్యాల నాగరాజు గురువారం ఒక ప్రకటనలో కోరారు. సీఎం రేవంత్‌రెడ్డి లబ్ధిదారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తారని తెలిపారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, రైతులు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

గుట్టలో వైభవంగా లక్ష పుష్పార్చన

యాదగిరిగుట్ట, జూలై 17 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో తొలి ఏకాదశి పర్వదినం పురస్కరించుకొని లక్ష పుష్పార్చన పూజలు శాస్త్రోక్తంగా వైభవంగా జరిగాయి. స్వామి, అమ్మవార్లకు అర్చక బృందం, వేద పండితులు సహస్రనామ పఠనాలతో వివిధ రకాల పూలతో లక్ష పుష్పార్చన పూజలు నిర్వహించారు. స్వయంభూ ప్రధానాలయ ముఖ మండపంలో ఉత్సవమూర్తులను పట్టువస్త్రాలతో దివ్య మనోహరంగా అలంకరించి ప్రత్యేక వేదికపై తీర్చిదిద్దారు. తెల్లవారుజామునే ఆలయాన్ని తెరిచిన అర్చకులు సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపారు. అనంతరం తిరువారాధన జరిపి, ఉదయం ఆరగింపు చేపట్టారు. స్వయంభూ ప్రధానాలయంలో స్వామి, అమ్మవార్లకు నిజాభిషేకం జరిపారు. తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయస్వామికి సహస్రనామార్చన చేపట్టి భక్తులకు స్వామి, అమ్మవార్ల దర్శన భాగ్యం కల్పించారు. ప్రధానాలయం వెలుపలి ప్రాకార మండపంలోని కల్యాణ మండపంలో సుదర్శన ఆళ్వారులను కొలుస్తూ హవనం జరిపారు. స్వామి, అమ్మవార్లను దివ్య మనోహరంగా ముస్తాబు చేసి గజ వాహనంపై వేంచేపు చేసి వెలుపలి ప్రాకార మండపంలో ఊరేగించారు. స్వామి, అమ్మవార్లకు నిత్య తిరుకల్యాణోత్సవం అత్యంత వైభవంగా సాగింది. ప్రధానాలయం ముఖ మండపంలో స్వామివారికి ఉదయం నుంచి సాయంత్రం వరకు పలు దఫాలుగా భక్తులతో సువర్ణ పుష్పార్చన జరిపించారు. బంగారు పుష్పాలతో దేవేరులకు అర్చన చేశారు. సాయంత్రం స్వామివారికి తిరువీధి సేవ, దర్బార్ సేవ అత్యంత వైభవంగా చేపట్టారు. రాత్రి స్వామివారికి తిరువారాధన చేపట్టి, తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయస్వామికి సహస్రనామార్చన జరిపారు. స్వామి, అమ్మవార్ల శయనోత్సవ సేవ అత్యంత వైభవంగా సాగింది. తొలి ఏకాదశి పురస్కరించుని పంచనారసింహస్వామిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. తిరుమాఢవీధులు, క్యూ కాంప్లెక్స్, క్యూలైన్లు, ప్రసాద విక్రయశాల, శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. సుమారు 20 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. అన్ని విభాగాలను కలుపుకొని స్వామివారి ఖజానాకు రూ.29,19,292 ఆదాయం సమకూరిందని ఆలయ అనువంశిక ధర్మకర్త బి.నరసింహమూర్తి, ఈఓ భాస్కర్‌రావు తెలిపారు.

డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క సతీమణి నందినికి స్వామివారి ప్రసాదం అందజేస్తున్న ఆలయ ఈఓ భాస్కర్‌రావు

స్వామివారిని దర్శించుకున్న డిప్యూటీ సీఎం సతీమణి

తొలి ఏకాదశి సందర్భంగా యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామిని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క సతీమణి నందిని బుధవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఆమెకు సంప్రదాయ స్వాగతం పలికి వేద ఆశీర్వచనం చేశారు. ఆలయ ఈఓ భాస్కర్‌రావు స్వామివారి ప్రసాదాన్ని అందజేశారు.

వెదిరె రామచంద్రారెడ్డికి నివాళి

భూదాన్ పోచంపల్లి, జూలై 17 : పట్టణంలో వినోబా సేవా సంఘం ఆధ్వర్యంలో ప్రథమ భూదాత వెదిరె రామచంద్రారెడ్డి 119వ జయంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన కాంస్య విగ్రహానికి పూలమాలలు నివాళులర్పించారు. వంద ఎకరాలు దానం చేసిన మహనీయుడు వెదిరె రామచంద్రారెడ్డి అని పలువురు కొనియాడారు. కార్యక్రమంలో వినోబాబావే సేవా సంఘం ఉపాధ్యక్షుడు కొయ్యడ నరసింహగౌడ్, ప్రధాన కార్యదర్శి ఏశాల మురళి, గౌడ సంఘం అధ్యక్షుడు గునిగంటి మల్లేశంగౌడ్, రజక సంఘం పట్టణ అధ్యక్షుడు చేరాల చిన్న నరసింహ, నాయకులు మోటె రజిత రాజు, చింతకింది రమేశ్, కట్కూరి పాండురంగంగౌడ్, చేరాల బుచ్చయ్య పాల్గొన్నారు.

భూదాన్ పోచంపల్లిలో రామచంద్రారెడ్డి విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

డాక్టరేట్ పొందిన శ్రీనివాస్‌కు సన్మానం

భువనగిరి కలెక్టరేట్, జూలై 17 : వివిధ సేవా కార్యక్రమాలకు గుర్తింపుగా గౌరవ డాక్టరేట్ అవార్డు పొందిన మండలంలోని తాజ్‌పూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ జిల్లా నాయకుడు ర్యాకల శ్రీనివాస్‌ను ముదిరాజ్ సంఘం నాయకులు బుధవారం సన్మానించారు. ఈ సందర్భంగా ముదిరాజ్ సంఘం నాయకులు మాట్లాడుతూ గ్రామ అభివృద్ధితోపాటు సమాజ క్షేమం కోసం ఎన్నో సంక్షేమ, సేవా కార్యక్రమాలు చేపడుతున్న శ్రీనివాస్ భవిష్యత్తులో మరిన్ని అవార్డులు, ప్రశంసలు పొందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం నాయకులు కిరణ్, రాజు, సందీప్, శంకరయ్య, మహేశ్, నవీన్, రాజు, ఐలయ్య, సాయికుమార్ పాల్గొన్నారు.

శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న ముదిరాజ్ సంఘం నాయకులు

సంస్థాన్ నారాయణపురం హెడ్ కానిస్టేబుల్ సస్పెన్షన్

చౌటుప్పల్, జూలై 17 : సంస్థాన్ నారాయణపురం పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తున్న హెడ్ కానిస్టేబుల్ సూర్యనారాయణను బుధవారం రాచకొండ సీపీ సుధీర్ బాబు సస్పెండ్ చేశారు. ఇటీవల బాధితుల నుంచి ఆయన లంచం తీసుకున్నట్లు వివిధ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. దాంతో ఆయనపై సమగ్ర విచారణ జరిపి నిజం అని తేలడంతో సస్పెండ్ చేశారు. ఈ సందర్భంగా సీపీ పోలీసులకు సూచనలు చేశారు. రాచకొండ పోలీస్ కమిషనరేట్ పరిధిలో పని చేస్తున్న అధికారులు మంచి పనిచేస్తే వారికి రివార్డ్ ఇస్తామని, లేకపోతే పనిష్మెంట్ తప్పదని హెచ్చరించారు.

21న జిల్లాస్థాయి చెస్‌పోటీలు

రామగిరి, జూలై 17 : అంతర్జాతీయ చెస్ డేను పురస్కరించుకొని ఈ నెల 21న జిల్లా స్థాయి బాల, బాలికల చెస్‌పోటీలు నిర్వహించనున్నట్లు నల్లగొండ జిల్లా చెస్ అసోసియేషన్ కార్యదర్శి కె.కరుణాకర్‌రెడ్డి, ఆర్బిటర్ ఎం.విశ్వప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నల్లగొండలోని కేంద్రీయ విద్యాలయంలో అండర్ -11, 13, 15 విభాగాల్లో వేర్వేరుగా పోటీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు వాట్సప్ నంబర్ 9985423823కు ఎంట్రీలు పంపించాలని సూచించారు.

చౌటుప్పల్ రూరల్ : దేవులమ్మ నాగారంలో పల్లకీ సేవలో పాల్గొన్న ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి దంపతులు, డీసీసీబీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి

భూదాన్ పోచంపల్లి : లక్ష్మీనారాయణస్వామి దేవాలయంలో సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు ఆచరిస్తున్న భక్తులు

ఘనంగా తొలి ఏకాదశి వేడుకలు

భువనగిరి కలెక్టరేట్/ భువనగిరి అర్బన్/ రాజాపేట/ బొమ్మలరామారం, జూలై 17 : తొలి ఏకాదశి పర్వదినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా వ్యాప్తంగా దేవాలయాల్లో బుధవారం పూజలు నిర్వహించారు. ఆలయాల్లో అర్చకులు ఉదయం నుంచి నిత్య కైంకర్యాలు చేపట్టారు. అనంతరం భక్తులకు తీర్థ, ప్రసాద వితరణ చేపట్టి ఆశీర్వచనాలు అందజేశారు. భక్తులు ఆలయాలను దర్శించుకొని పూజలు నిర్వహించారు. ఉపవాస దీక్షలు చేపట్టారు. భువనగిరి పట్టణంలోని పచ్చలకట్ట సోమేశ్వరాలయం, కన్యకాపరమేశ్వరి, సాయిబాబా దేవాలయాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పూజలు నిర్వహించారు. రామన్నపేట మండల కేంద్రంలోని చెన్నకేశవస్వామి ఆలయంలో మూల విరాట్టుకు అభిషేకాలు చేశారు. అనంతరం తులసీ దళాలతో అర్చనలు నిర్వహించారు. దీపారాధన చేశారు.

పూజల్లో ఎమ్మెల్యే దంపతులు

చౌటుప్పల్ రూరల్ : మండలంలోని దండు మల్కాపురం గ్రామంలోని ఆందోళ్ మైసమ్మ దేవాలయం, దేవులమ్మ నాగారంలోని ఆది మహావిష్ణువు ఆలయాల్లో మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి దంపతులు, డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి తొలి ఏకాదశి పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారికి ఆలయాల అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆది మహావిష్ణువు దేవాలయంలో పల్లకీ సేవలో ఎమ్మెల్యే దంపతులు పాల్గొన్నారు. అనంతరం ఆందోళ్ మైసమ్మ దేవాలయంలో ఈ నెల 19న జరిగే బోనాల పోస్టర్‌ను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. కార్యక్రమాల్లో చౌటుప్పల్ మున్సిపల్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు, దేవాలయ కమిటీ చైర్మన్ వరకాంతం జంగారెడ్డి, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

పోచంపల్లిలో సామూహిక వ్రతాలు

భూదాన్ పోచంపల్లి : తొలి ఏకాదశిని పురస్కరించుకొని మండలంలోని పలు దేవాలయాల్లో బుధవారం భక్తులు పూజలు చేశారు. పట్టణంలోని మార్కండేశ్వరస్వామి, లక్ష్మీనారాయణ స్వామి దేవాలయాల్లో పాండురంగ స్వామి, లక్ష్మీనారాయణస్వామి భజన మండలి ఆధ్వర్యంలో సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు నిర్వహించారు. కనుముక్కుల వేంకటేశ్వరస్వామి ఆలయం, దేశ్ ముఖి సాయి బృందావనంలో ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు ఉపవాస దీక్షలు చేపట్టారు.

భక్తిశ్రద్ధలతో మొహర్రం

ఆలేరు రూరల్/ రాజాపేట/ ఆత్మకూర్ (ఎం)/ భువనగిరి కలెక్టరేట్/ చౌటుప్పల్/ బొమ్మలరామారం/ వలిగొండ/ భూదాన్ పోచంపల్లి/ మోత్కూరు, జూలై 17 : మోహర్రం పండుగను జిల్లా వ్యాప్తంగా కులమతాలకతీతంగా భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా బుధవారం గ్రామ గ్రామాన హసన్, హుస్సేన్ వీరమరణానికి గుర్తుగా డప్పుచప్పుళ్లతో పీర్ల ఊరేగింపు నిర్వహించారు. ఇండ్ల ముందుకు వచ్చిన పీర్లకు భక్తులు మట్కీలు, మలీద ముద్దలు, కుడకలు, బెల్లం సమర్పించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. సాయంత్రం బావుల్లో పీర్లను నిమజ్జనం చేశారు.

వలిగొండ మండలం నాగారంలో పీర్లను ఊరేగిస్తున్న భక్తులు

భూదాన్ పోచంపల్లిలో పీర్ల ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

చౌటుప్పల్ పట్టణంలో మొహర్రం వేడుకలు నిర్వహిస్తున్న భక్తులు



భువనగిరి కలెక్టరేట్ : మన్నేవారిపంపు గ్రామంలో..

మోత్కూరు : పనకబండ గ్రామంలో..

సిరిపురం - వెలిమినేడు రోడ్డు వద్ద నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

సిరిపురం - వెలిమినేడు రోడ్డును బీటీగా మార్చాలి : సీపీఎం

రామన్నపేట, జూలై 17 : సిరిపురం - వెలిమినేడు రోడ్డును బీటీగా మార్చాలని సీపీఎం నాయకుడు బల్గూరి అంజయ్య డిమాండ్ చేశారు. సీపీఎం పోరుబాటలో భాగంగా బుధవారం సిరిపురం గ్రామ నాయకులతో కలిసి రోడ్డును పరిశీలించి మాట్లాడారు. మెటల్ రోడ్డు ఉండటం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రధాన గ్రామాలను కలిపే రహదారుల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణి వీడాలని కోరారు. కార్యక్రమంలో మజీ సర్పంచ్ మిర్యాల భాస్కర్, మాజీ ఎంపీటీసీ బడుగు రమేశ్, నాయకులు అంబటి మల్లారెడ్డి, సుభాశ్‌రెడ్డి, సైదులు, స్వామి పాల్గొన్నారు.

ఆంజనేయస్వామి విగ్రహ ఏర్పాటుకు భూమి పూజ

భువనగిరి అర్బన్, జూలై 17 : పట్టణంలోని ఖిలా సమీపంలో గల సీతా రామాంజనేయ స్వామి ఆలయ ప్రాంగణంలో ఆంజనేయ స్వామి 21 ఫీట్ల విగ్రహాన్ని ప్రతిష్ఠించడానికి బుధవారం విగ్రహ దాత ఊటుకూరి నాగమణి, భాస్కర్ భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆలయ మాజీ చైర్మన్ తాడూరి చంద్రయ్య మాట్లాడుతూ ఆలయ పునర్నిర్మాణానికి దాతలు సహకరించాలన్నారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ వడిచర్ల లక్ష్మీకృష్ణ, సభ్యులు దొంత లక్ష్మణ్, తాడూరి కిష్టయ్య, రాజశేఖర్, కాలనీవాసులు పాల్గొన్నారు.

భూమి పూజ చేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

చింతపల్లిలో తాగునీటి కష్టాలు

మాల్, జూలై 17 : చింతపల్లి మండల కేంద్రంలో వారం రోజుల నుంచి తాగునీటి సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామ పంచాయతీ కార్యదర్శికి పలుమార్లు ఫిర్యాదు చేసినా ఫలితం లేకుండా పోయింది. గ్రామానికి నీటిని సరఫరా చేసే మోటర్లు చెడిపోయాయని, వాటికి మరమ్మతులు చేసేందుకు నిధులు లేవని పంచాయతీ అధికారులు సమాధానం ఇస్తున్నట్లు స్థానికులు వాపోతున్నారు. ప్రభుత్వం నుంచి నిధులు రావడం లేదని, తామేమీ చేయలేమని చెబుతున్నారని పేర్కొంటున్నారు. దాంతో గ్రామస్తులు డబ్బులు వెచ్చించి ట్యాంకర్ల ద్వారా నీటిని కొనుగోలు చేసుకుంటున్నారు. అధికారులు స్పందించి నీటి సమస్యను తీర్చాలని ప్రజలు కోరుతున్నారు.

చింతపల్లి మండల కేంద్రంలోని ఓ ఇంట్లో ట్యాంకర్ ద్వారా పోయించుకున్న ట్యాంకర్ నీరు

పిల్లాయిపల్లి కాల్వను కప్పేసిన గుర్రపు డెక్కాకు

భూదాన్ పోచంపల్లి, జూలై 17 : ఆకుపచ్చని తివాచీలా కనిపిస్తున్న ఈ దృశ్యం పార్కులో అనుకుంటే పొరపాటే. ఇది భూదాన్ పోచంపల్లి మండలంలోని పిల్లాయిపల్లి గ్రామ శివారులో గల పిల్లాయిపల్లి కాల్వ. ఈ కాల్వ అంతా గుర్రపు డెక్కాకుతో నిండి ఉంది. మూసీ నీటికి గుర్రపు డెక్కాకు విపరీతంగా పెరిగి కాల్వను పూర్తిగా కప్పేసింది. ఇది నీటి ప్రవాహానికి అడ్డంకిగా మారింది. దీంతో చేపల శ్వాసకు సైతం ఇబ్బంది అవుతుంది. ఈ క్రమంలో గుర్రపు డెక్కాకును తొలగించి నీరు సక్రమంగా పారేలా చూడాలని స్థానిక రైతులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

పిల్లాయిపల్లి గ్రామ శివారులో గుర్రపు డెక్కాకుతో నిండిన పిల్లాయిపల్లి కాల్వ

నేడు విద్యాసంస్థల బంద్

మోత్కూరు, జూలై 17 : నిరుద్యోగులపై పోలీసుల లాఠీచార్జి, అక్రమ కేసుల నమోదుకు నిరసనగా గురువారం విద్యార్థుల రాజకీయ పార్టీ (వీఆర్‌పీ) ఆధ్వర్యంలో గురువారం విద్యాసంస్థల బంద్ నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఎడ్ల నరేశ్ తెలిపారు. బుధవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలన్నారు. జీఓ 46ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగ భృతి రూ.4వేలు ఇవ్వాలన్నారు. బంద్‌కు విద్యా సంస్థల యాజమాన్యాలు సహకరించాలని కోరారు. సమావేశంలో వీఆర్‌పీ నాయకులు బాబా షరీఫ్, కోమటి అనిల్, జంపాల సాయి, బయ్యని సాయికుమార్ పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

ఆత్మకూరు(ఎం), జూలై 17 : మండల కేంద్రానికి చెందిన పైళ్ల కిష్టయ్య గుండెపోటుతో, చిన్నం మల్లయ్య అనారోగ్యంతో మృతి చెందారు. ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య సహకారంతో ఒక్కో కుటుంబానికి అందజేసిన రూ.5వేలను మాజీ సర్పంచ్ జెన్నాయికోడె నగేశ్ బుధవారం మృతుల కుటుంబాలకు అందజేశారు. ఆయన వెంట మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ యాస లక్ష్మారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ జిల్లాల శేఖర్‌రెడ్డి, నాయకులు మల్లేశం, భాస్కర్, మురళీకృష్ణ, రాంబాబు ఉన్నారు.

'సమస్యల పరిష్కారంలో మున్సిపల్ పాలకవర్గం విఫలం'

ఆలేరు రూరల్, జూలై 17 : ప్రజా సమస్యల పరిష్కారంలో మున్సిపాలిటీ పాలకవర్గం విఫలమైందని సీపీఎం నాయకులు అన్నారు. సీపీఎం పోరుబాటలో భాగంగా బుధవారం మున్సిపాలిటీలోని పలు వీధుల్లో ఇంటింటికీ తిరిగి సమస్యలపై అధ్యయనం చేశారు. పట్టణంలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉన్నదని, మోరీలు చెత్తాచెదారంతో నిండి కంపు కొడుతున్నాయని అన్నారు. డ్రైనేజీ నిర్మాణం కోసం ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య నిధులు వెచ్చించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శి ఎంఏ ఇక్బాల్, నాయకులు మొరిగాడి రమేశ్, బాల రాజు, నాగరాజు, పరశురాములు పాల్గొన్నారు.

ఆలేరులో డ్రైనేజీని పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

'19న ఎమ్మార్పీఎస్ రాష్ట్ర మహాసభను జయప్రదం చేయండి'

ఆత్మకూరు(ఎం), జూలై 17 : యాదగిరిగుట్టలోని లక్కీ ఫంక్షన్ హాల్‌లో ఈ నెల 19న నిర్వహించే ఎమ్మార్పీఎస్ రాష్ట్ర మహాసభను విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా నాయకుడు కుమ్మరికుంట్ల గణేశ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో మహాసభ ప్రచార కరపత్రాలను విడుదల చేసి మాట్లాడారు. మండలంలోని అన్ని గ్రామాల నుంచి దళితులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి మహాసభను విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల ఇన్‌చార్జి మేడి శ్రీనివాస్, నాయకులు రవీందర్, నవీన్, ఎల్లయ్య, చంద్రయ్య, బాల కృష్ణ, నర్సింగ్‌రావు, ముత్తయ్య, ఐలయ్య, సాయిబాబా పాల్గొన్నారు.

రాష్ట్ర మహాసభల ప్రచార కరపత్రాలను విడుదల చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

రావి నారాయణరెడ్డి కాంస్య విగ్రహ పనుల పరిశీలన

భువనగిరి కలెక్టరేట్, జూలై 17 : మండలంలోని బొల్లేపల్లి గ్రామానికి చెందిన తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధుడు రావి నారాయణరెడ్డి కాంస్య విగ్రహ తయారు పనులను రావి నారాయణరెడ్డి సేవా సంస్థ అధ్యక్షుడు చెరుకుపల్లి శ్రీనివాస్, కార్యదర్శి రావి సుకేశ్‌రెడ్డి బుధవారం హయత్‌నగర్‌లో పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రావి నారాయణరెడ్డి కాంస్య విగ్రహ పనులు చురుకుగా జరుగుతున్నాయన్నారు. అనుకున్నట్లుగా విగ్రహం రూపు దిద్దుకుంటుందని చెప్పారు. విరాళాలు ఇచ్చేవారు 8121028642కు ఫోన్ పే, గూగుల్ పే ద్వారా గానీ, సంస్థ బ్యాంకు అకౌంట్ 73217286129 ఏపీ గ్రామీణ వికాస్ బ్యాంకు, బొల్లేపల్లి బ్రాంచిలో గానీ జమ చేయవచ్చని తెలిపారు. మహా దాతల పేరు శిలాఫలకం మీద రాయడానికి అధ్యక్షుడిని 9883089999లో సంప్రదించాలని సూచించారు.

రావి నారాయణరెడ్డి విగ్రహ ఏర్పాటు పనులను పరిశీలిస్తున్న సేవా సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు

శాఖా గ్రంథాలయానికి పుస్తకాలు బహూకరణ

శాఖా గ్రంథాలయానికి పాఠ్య పుస్తకాలు, ర్యాక్ అందజేస్తున్న దాతలు

మోత్కూరు, జూలై 17 : మోత్కూరు శాఖా గ్రంథాలయానికి దాతలు పాఠ్య పుస్తకాలు బహూకరించారు. పట్టణానికి చెందిని దోర్నాల శ్రీరాములు జ్ఞాపకార్థం వారి కుమారులు హరిబాబు, గిరిబాబు 200 సాహిత్యం పుస్తకాలు, ర్యాక్‌ను బుధవారం గ్రంథాలయ కమిటీ చైర్మన్ కోమటి మత్స్యగిరికి అందజేశారు.

కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ పురుగుల వెంకన్న, గ్రంథాలయం ఇన్‌చార్జి చిలకమర్రి బాబుచారి, పాఠకులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

మోత్కూరు, జూలై 17 : మండలంలోని దత్తప్పగూడేనికి చెందిన ఎలుగు గోపమ్మ అనారోగ్యంతో దవాఖానలో చికిత్స పొందగా ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ.60వేలు మంజూరయ్యాయి. సంబంధిత చెక్కును బుధవారం గ్రామంలో బాధితురాలికి మాజీ ఎంపీటీసీ ఎలుగు పార్వతమ్మ అందజేశారు. కార్యక్రమంలో చింత చంద్రయ్య, వల్లపు వెంకన్న, నోముల సాయిలు, తొంట భాస్కర్, వీరయ్య పాల్గొన్నారు.

బాధితురాలు గోపమ్మకు సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేస్తున్న నాయకులు